మనసే హేతువు మనుజుని
మనుగడకును బంధమునకు మోక్షలకెల్లన్
మనసే ముఖ్యము ముక్తికి
మనసే నరకంబు దెచ్చు మైమరపించున్.

విద్యార్థులారా!

శరీరము, మనస్సు, ఆత్మల యొక్క కలయికనే మానవుడు. ఇవే భావములను విశ్లేషించి అంతరమును వున్నతస్థాయికి తీసుకొనిపోయే సోపానములే కర్మలు. వాని ఆచరించునది దేహము. తెలుసుకొనేది మనస్సు. నిత్యమై, సత్యమై, నిరంతరమై వుండునది ఆత్మ. ఇదియే మానవుని యందలి దేవత. చేయుట, తెలుసుకొనుట, వుండుట అనే త్రిశక్తుల యొక్క అభివ్యక్తమే మానవత్వము. ఇటు మనస్సు, దేహము, ఆత్మ వేరు వేరు రూపముల చేత వేరు వేరు ఫలితములు అందించుచు, వేరువేరు నామములతో వుండినప్పటికి యీ మూడింటి యొక్క ఏకత్వము వలనే మానవత్వము దివ్యత్వమును పొందుచున్నది. ఈ మూడింటి యొక్క భిన్నత్వమే మానవుని పశుత్వమునకు గొనిపోతుంది. లౌకికముగా, పారమార్థికముగా తరచుగా మనము వినే పదము 'అంతఃకరణ'.

ఏమిటీ అంతఃకరణ? దీని స్వరూపమేమిటి? దీని స్వభావమేమిటి? దీని విశిష్టత ఏమిటి? దీని గమ్యమేమిటి? అని విచారణ చేసినప్పుడు మనసే అనేక విధములైన సూక్ష్మరూపములను ధరించి 'అంతఃకరణ' అని పేరునందుకుంటుంది. మనసు బుద్ధి, చిత్తము, అహంకారము యీ నాల్గింటి ఆకారములు కూడను మనస్సే. బుద్ధి, చిత్తము, అహంకారములు మనసు యొక్క సూక్ష్మరూపములే. ఒక్కొక్క కర్మలో ప్రవేశించినప్పుడు ఒక్కొక్క పేరును పొందుతూ వుంటుంది. ఒకే బ్రాహ్మణుడు మందిరములో పూజ చేస్తూ వున్నప్పుడు అతనిని పూజారి బ్రాహ్మణుడని అంటారు. ఇట్లనే వంటరూమ్ లో వంట చేస్తున్నప్పుడు వంట బ్రాహ్మణుడు అంటారు. ఈ బ్రాహ్మణుడే విద్యార్థులకు విద్యను బోధిస్తున్నప్పుడు అధ్యాపక బ్రాహ్మణుడంటారు. పంచాంగములు చెప్పుతున్నప్పుడు పంచాంగ బ్రాహ్మణుడు అంటున్నారు. బ్రాహ్మణుడు ఒక్కడే అయినప్పటికి అతను చేసుకొనే వృత్తులను

పురస్కరించుకొని అతనికి యిట్టి నామములు కలుగుతూ వచ్చాయి. అదే విధముగనే సంకల్ప
వికల్పములతో కూడుకున్నప్పుడు దానిని మనస్సు అని ఒక పేరుతో పిలుస్తూ వచ్చారు. విచ
క్షణా జ్ఞానముతో విషయములను విచారణ సల్పి నిర్ణయించేటప్పుడు దానిని బుద్ధి అనే పేరు
తో పిల్చారు. ఇది కేవలము విచక్షణా జ్ఞానముతో జరిపే విచారణ. దానిని discrimination
knowledge అంటారు. ఇక మూడవది చిత్తము. ఇది స్మృత్యాత్మకమైనది. కనుకనే దానికి
చిత్తమని పేరు వచ్చింది. మనస్సు, శరీరముతో తాదాత్మ్యము పొందినప్పుడు కలిగే స్వరూపము
నే అహంకారము అని పిలుస్తూ వచ్చారు. ఒకే మనస్సు యిన్ని కర్మల యందు యిన్ని స్థానము
లయందు, యిన్ని రకములైన పేర్లు పొందుతూ ప్రకటిస్తూ వచ్చింది.

అన్నింటికిని మనస్సే కారణము. ఈ ప్రపంచమంతయు కూడను మనస్సు
చేత కట్టబడి వుంటుంటాది. 'మనో మూల మిదం జగత్' మనస్సు లేనటువంటిది యెక్కడ
కూడను కానరాదు. ఇట్టి మనసు కల్గినవాడు కనుకనే యితనికి మనుష్యుడని పేరు వచ్చింది.
యద్భావం తద్భవతి అని యీ మనుష్యుని యొక్క భావము యెట్టిదో దాని యొక్క ఫలితములు
కూడను అట్లనే వుంటాయి. దీనినే ఆంగ్ల భాషలో so think is the man so is the man
అని అన్నారు. మానవత్వము కేవలము ఒక మనస్తత్వముతో కూడినది. మనస్సంటే ఏమిటి?
మనస్సనగా మనిషే, మనిషి అనగా మనస్సు. మనస్సనగా సంకల్ప వికల్పముల యొక్క చేరికే.
ఈ సంకల్పముల యొక్క ఫలితమే మానవుని యొక్క చర్యలు. ఈ చర్యల యొక్క ప్రభావమే
మనము నిత్యమూ అనుభవించే సుఖ దుఃఖములు. జగత్తు యొక్క మంచి చెడ్డలు మాన
వుని యొక్క చర్యలపై ఆధారపడి వుంటుంటాయి. ఈ చర్యలకు ఆధారమేమిటి? సంకల్పము
లే. కనుకనే మానవుని యొక్క సంకల్పములు సత్సంకల్పములుగా నుండినప్పుడే జీవితము
సరియైన జీవితముగా రూపొందుతుంది.

సంకల్పములు చాలా శక్తివంతమైనవి. మనిషి మరణించినా కూడను సంకల్ప
ములు స్థిరముగా వుంటుంటాయి. కనుకనే ఆ సంకల్పములకు మనము సరియైన సాధన
సల్పాలి. దుస్సంకల్పములు మనలో ఆవిర్భవించకుండా చూచుకోవాలి. దాని వలనే మానవుని
కి మానవునికి మధ్యనున్నటువంటి ప్రేమ తత్త్వము క్షీణించి పోయింది. మానవునికి మానవుని
కి మధ్యనున్న ఆత్మతత్త్వమును విస్మరించారు. అందరియందు వున్నటువంటి ఆత్మతత్త్వము
ఒకటే అని గుర్తించినప్పుడు యీ భేదమే మాత్రము వుండదు. కనుక మానవత్వమనేది
లమ వ్యక్తిత్వముతో ప్రారంభమై సమాజములో ప్రవేశించి దేశమునందు వ్యాపించి, విశ్వ

ముందు అంత్యమౌతున్నది. కనుక ప్రపంచము యొక్క శాంతి అంతయు వ్యక్తిపైన ఆధారపడి వుంటున్నది. ప్రపంచము, వ్యక్తి యిరువురు కూడను మనస్సుపై ఆధారపడి వుంటున్నారు. కనుక మనసును సరైన మార్గములో వుంచటానికి తగిన కృషి చేయాలి. మత్స్యము జలమునకు విరుద్ధ మార్గములో పయనించి తనయొక్క ప్రమాదమును తాను తప్పించుకోటానికి చూస్తుంది. అటులనే మానవుడు దుస్సంకల్పములకు విరుద్ధమైన రీతిగా సంచరించి వాటిని అరికట్టి తన యొక్క ప్రమాదమును తప్పించుకొనుటకు ప్రయత్నించాలి. ఈ నాటి మానవుడు మత్స్యమునకున్న తెలివి తేటలను కూడను తాను సర్తించుకోలేక పోతున్నాడు. ఈనాటి మానవుడు తన యొక్క ప్రమాదమును తానే కల్పించుకుంటున్నాడు.

ఈనాటి మానవుడు తన యొక్క సుఖదుఃఖములకు తానే కారణమవుతున్నాడు. మన యొక్క కష్టనష్టములకుగాని, సుఖదుఃఖములకుగాని, మనయొక్క విచారములకుగాని యితరులు కారకులు కారు. మన సంకల్పములే వీటికి కారణము. అనేక కొమ్మలతో తలంపులతో కూడిన యీ సంసార వృక్షమునకు మనసే వేరు. మనసును మనము నిర్మూలము గావించినప్పుడే వృక్షము కూడ నిర్మూలమవుతుంది. ఏమిటి యీ సంసారమంటే? ఆలుబిడ్డలతో కూడినటువంటి కుటుంబమా? కాదు. కాదు. సంసారమనగా సంకల్పమే. ఈ సంకల్పమునకు మూలాధారము మనసే. ఈ వేరు అనే మనస్సును మనము నిర్మూలము గావించినప్పుడు యీ సంసారమనే వృక్షము నిర్మూలమవుతుంది. ఐతే మనసును నిర్మూలించుటకు వేరు మార్గమున్నదా అని సందేహించవచ్చు. అన్నింటికి ఆది అంత్యములుంటున్నవి. పుట్టిన వ్యక్తికి, వస్తువుకు అంత్యముంటున్నది. ఏ ఒక్కటి కూడను యీ ప్రపంచములో శాశ్వతమైనది లేదు. కనుకనే దీనికి 'అనిత్యం అసుఖం లోకం' అన్నారు. అనిత్యము, అశాశ్వతము అయిన దీనినుండి మనము నిత్యసత్యమైనటువంటి తత్వమును పొందాలంటే యీ యొక్క ఆత్మ తత్వమే సత్యమైన, యీ ఆత్మ తత్వము సరైన మార్గము. అందువలననే caste of humanity అని. మానవత్వమనేటువంటిదే సర్వులయందు కూడను ఏకత్వముగా వుంటుంది. అందరియందు సమత్వముగా వుండేది మనస్సే.

ఐతే యీ సమత్వము వేరుగా వుండటంచేతనే మార్పు చెందుతున్నది. మనస్సు యొక్క స్వరూపము రంగులుగా మార్పు చెందుతున్నది. మనసుకు రంగులుంటున్నాయా? అంటే వుంటున్నాయి. కోప భావముతో వున్న మనసు ఎర్రగా వుంటుంది. స్వార్థ భావముతో వుండిన మనస్సు గోధుమ రంగుగా వుంటుంది. అహంకారముతో కూడిన మనసు కమలా

పండు రంగుగా వుంటుంది. భగవంతునికి అర్పితమైన మనస్సు శుద్ధముగా వుంటుంది యీ వస్త్రము వలె. మనస్సు కూడను అనేక రంగులు వేసుకుంటుంది. ఇది యితరుల యొక్క ప్రభావము కాదు. మన సంకల్పములే మనకీ దుర్గతిని పట్టిస్తున్నాది. కనుక సంకల్పములను పవిత్రమైనవాటిగా ఎన్నుకున్నప్పుడే మన జీవితము శాంతి భద్రతలలో వుండగలదు. ఈ నాడు లోకములో ఎక్కడ చూచినా భయమే. ఇంటిలో వుండినా భయమే. వీధిలోకి వెళ్ళినా భయమే. రైలెక్కినా భయమే. బస్సెక్కినా భయమే. ప్లేను ఎక్కినా భయమే. పడవెక్కినా భయమే. నడచి పోదామనుకున్నా భయమే. లేదు వంటరిగా యింట్లో వుండటానికి భయమే. ఈ విధమైన భయమునకు మూల కారణమేమిటి? మానవునిలో వుండవలసిన పవిత్ర సంకల్పములు నిర్మూలమయ్యాయి. లోకమంతా భయం భయంగా వుంటున్నది

భయం భయం బ్రతుకు భయం అన్నీ
మన జీవితమంతా ఒక పద్మవ్యూహం.

ఇదంతా కూడ ఒక పద్మవ్యూహముగా భయంతో కూడి వుంటున్నది. పద్మవ్యూహము యొక్క రహస్యము ఏమిటి? ప్రవేశించటము మాత్రమే తెలియునుగాని తిరిగి వెనుకకు వచ్చు మార్గము తెలియదు. ఎవరికి? అభిమన్యునికి. ఈ నాడు అందరూ అభిమన్యులే. అందరు అభిమన్యులేగాని ప్రవర్తన భిన్నము. ఈ నాడు ప్రపంచములో భోగభాగ్యముల నిమిత్తమై ప్రవేశించటమే తెలియునుగాని అందుండి తప్పించుకొని వచ్చు మార్గము తెలుసుకోటానికి ప్రయత్నించటంలేదు.

ఈ లౌకిక భోగభాగ్యములు దుఃఖమునుండి ఆవిర్భవించినవే. దానిని మనము గుర్తించుకోలేక పోతున్నాము. కనుక సంకల్పములను సరైనవిగా విచారణ సల్పి బుద్ధికి అప్పచెప్పినప్పుడే సరైన సమాధానము మనకు లభ్యమువుతుంది. కఠోపనిషత్తు దేహము రథమనియు, ఇంద్రియములు గుర్రములనియూ, మనసు పగ్గమనియు, బుద్ధి సారథి అనియు వర్ణిస్తూ వచ్చింది. ఇక్కడ మనసు ఏ స్థానములో వుంటుందాదని మనము చక్కగా విచారించాలి. ఇక్కడ గుర్రములకు, సారథికి మధ్యలో వున్నది యీ పగ్గము. అనగా యింద్రియములకు బుద్ధికి మధ్యనున్నదే మనస్సు. ఈ మధ్యనున్నటువంటి మనసు బుద్ధిని అనుసరించినా బుద్ధి కలిగి వుంటుంది. ఇంద్రియములను అనుసరించినా బద్ధుడై అనుభవిస్తాడు. కాని యీనాడు అనేకమంది యింద్రియములకు దాసులై తద్వారా దుఃఖమునకు గురౌతున్నారు. ఇంద్రియములను అనుసరించటమే ప్రవృత్తి మార్గము. బుద్ధిని అనుసరించటు

ము నివృత్తి మార్గము. కానీ అధిక భాగము ప్రవృత్తి మార్గమునందే తమ జీవితమును అపవిత్రమును గావించుకుంటున్నారు. ఇక నివృత్తిని గురించి యేమాత్రము కూడను విచారణ సల్పటం లేదు. కనుక నివృత్తిని కూడా కొంత వరకును జాగ్రత్తగా కాపాడుకోవాలి. సారథికి పగ్గములు చేతిలో లేకపోతే గుఱ్ఱములు లో నడవవు. సారథి వదలిన పగ్గములచే యీ గుఱ్ఱములు పరుగెత్తుతున్నాయి. అందులో యీ గుఱ్ఱములు సామాన్యమైన గుఱ్ఱములు కావు. విషయభోగములను కేవలము విచారణ చేస్తూ పోతున్నాయి. ఒక్కొక్క గుఱ్ఱము ఒక్కొక్క వైపుకు తిరుగుతుంటది. కనుక యీ ప్రమాదము ఎవరికి? రథమునకే కాదు రథములో వున్నవారికి కూడా యీ ప్రమాదము సంభవిస్తుంది. కనుక యీనాడు దేహమును అపవిత్రము గావించుకుంటున్నారు. దేహమునందున్న ఆత్మ తత్వాన్ని మనము నిర్మూలము చేస్తున్నాము. ఈనాడు రెండింటికీ చెడిన రేవడిగా తయారౌతున్నాము. కనుక మానవత్వమును మనము గుర్తించాలంటే మనసు యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించాలి. నిరంతరము మానవుని యందు యితరుల యొక్క కీడును గూర్చి చింతిస్తూ వుంటారు. ఇది చాలా ప్రమాదము. ఇతరులయొక్క కీడు చింతించటం చేత తనకేదో మేలు జరుగుతుందాదని భావిస్తున్నారు వెఱ్ఱివారు. తాను యితరుల కీడు కోరినటువంటి వాడు, యితరులకు కీడు సంభవించినప్పటికిని తిరిగి ఆ కీడు అంతకంటె అనేకరెట్లు తిరిగి తననే హింసిస్తూ వుంటుంది. ఇది యీనాటి మానవుడు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. దీనికి సరైన ఆదర్శము దుర్యోధన దుశ్శాసనాదులు. వారు ధర్మమూర్తులైన పాండవులపైన అనేక విధములైన కష్టాలు పూని నిరంతరము వారికి కీడును గూర్చి తలపెస్తూ వచ్చారు. ఏదో వారి సంకల్పములు దుస్సంకల్పములైనప్పటికిని దాని ప్రభావము పాండవులపై పడినప్పటికిని కడపటికి ఏమైపోయింది. అంతకంటె అనేక రెట్లు కీడు వారికే సంభవించింది.

విద్యార్థులారా! ఈ విషయాన్ని మరు-చక్కగా గుర్తించాలి. ఎవరికి కీడును మనము కోరరాదు. ఒక భాగము యితరులకీడును కోరితే పది భాగములు మనకు కీడు లభిస్తుంది. ఇతరులను ఎవరిని దూషించరాదు. నీవు యితరులను దూషించినప్పుడు నిన్ను అనేక మంది దూషిస్తారు. స్నేహితులను వంచించిన వాడు స్నేహితులచే వంచింప బడతాడు. తండ్రి మాటను ధిక్కరించిన వాడు తన కుమారుని చేత తాను ధిక్కరింప బడతాడు. పరులను హింసించినవాడు పరుల చేత హింసింపబడతాడు ఈ reaction, reflection, resound మనసు యొక్క ప్రభావము. కనుక మనము

ఎవ్వరిని యే విధముగా కూడను దూషించటముగాని, హింసించటముగాని ప్రయత్నించ కూడదు. కేవలము సామాన్యమైన మానవులకే కాక భగవంతుని కూడా దూషించే ప్రబుద్ధులున్నారు. ఇది కేవలము వారియొక్క స్వభావముగా వుంటుంటాది. నిజముగా యోచిస్తే భగవంతుడు వారికే కీడు చేయలేదు. ఏ అపకారము చేయలేదు. కాని ఇటువంటి పరిస్థితి యందు భగవంతుని యందు కూడను కొన్ని లోపములు వెతికే దుష్టులుంటున్నారు.

ఊరక సజ్జనుండొదిగి యుండిన నైన దురాత్మకుండని
ష్కారణ మోర్వలేక అపకారము జేయుట వాని విద్యగా
చీరెలు నూరు టంకములు చేసెడివైనను పెట్టెనుండగా
చేరి చినింగి పోగొరకు చిమ్మెటకేమి ఫలంబు

వేయి రూపాయల చీరనైనా కొరుకుతుందది. వంటయింటిలో పడివున్న మసిగుడ్డనైనా కొరుకుతుందది. కొట్టటం దాని స్వభావం. దీనికి విచక్షణా జ్ఞానము శూన్యము. విచారణా స్వభావము యే మాత్రము వుండదు. అటులనే దుస్సంకల్పములు కలిగిన వ్యక్తి యందు దుర్భావములు కూడ అభివృద్ధి అవుతూ వుంటాయి. ఈ దుర్భావములకు కారణమేమిటి? సత్సంకల్పములు పెంచుకోలేక పోవటమే దీనికి కారణము. దుర్గంధము వుంటున్నాదంటే దానిని మనము దూరము చేసుకోవాలనుకున్నప్పుడు మనము సుగంధమును దగ్గర తెచ్చుకోవాలి. కొంతమంది రూములో కూడను Air spray కొడుతూ వుంటారు. దేనికోసము. ఆ దుర్గంధము దూరము గావించటము కోసము. దుర్గంధము వున్నప్పుడు గంధపు వత్తులో, సాంబ్రాణియో వేసుకొని ఆ దుర్గంధమును దూరము చేసుకుంటారు. కనుక మానవుని యందలి దుస్సంకల్పములను మనము దూరము గావించుకోవాలంటే సత్సంకల్పములను మనము పెంచుకోవాలి. కేవలము సత్సంకల్పముల చేతనే మన జీవితము సార్థకమవుతుంది. దుస్సంకల్పముల చేత మన జీవితము పశుత్వమును పొందుతుంది. కనుక మనస్సు చాలా ప్రమాదమైనది. కనుకనే అర్జునుడు కూడను 'చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢం' ఇది కేవలము చంచలమైనదే కాదు చాలా దృఢమైనది అని కృష్ణుడు ప్రార్థించాడు.

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్.

ఈ త్యాగం ఎప్పుడొస్తుంది. త్యాగాచ్ఛాంతిరనన్తరమ్. శాంతి. శాంతి. శాంతి. శాంతి ఎక్కడనుండి

వస్తుంది. శాంతికి తగిన ప్రయత్నము మనము చేస్తున్నామా. ఈ శాంతి మనయందే వుంటున్నాది కాని బయట లేదు. కనుక యీ శాంతి అనే దానిని మనము పొందాలనుకున్నప్పుడు తగిన సద్భావాన్ని మనము పెంచుకోవాలి. అభ్యాసము చేయాలి. ఏ విధముగా చేయాలి. వ్యక్తిగతమైన భావములు మొట్టమొదట అదుపులో పెట్టుకోవాలి. ఇక్కడ వ్యక్తిగతమైనవి చాలా అత్యవసరము మానవునికి. ఈ మానవత్వమును గుర్తించాలనుకుంటే నేను మానవుడను, నేను మానవుడను, నేను మానవుడను అని మూడుసార్లు చింతించాలి. కేవలము నేను మనిషి నేను మనిషి నేను మనిషి అని అనుకున్నంత మాత్రమున పూర్ణమనిషి కాలేడు. ఇది అర్ధమనిషి మాత్రమే కాగలడు. తిరిగి మూడుసార్లు నేను పశువును కాదు, నేను పశువును కాదు, నేను పశువును కాదు అనుకోవాలి. అప్పుడే పూర్ణసత్యమవుతుంది. ఈనాడు నేను మానవుడనే భావిస్తున్నాడు. చెప్పుకుంటున్నాడు. కానీ పశువుగా ప్రవర్తిస్తున్నాడు. ఇంతకంటె పశువే మేలు కదా. నేను పశువు నేను పశువని పశువుగానే ప్రవర్తిస్తుంది. కాని వీడు నేను మనిషి అనుకుంటూ పశువుగా ప్రవర్తిస్తున్నాడు. కావున మనిషి కంటె పశువే మేలు. నీవు మనిషి వనేది ఎక్కడనుంచి వచ్చింది. మనసు నుంచి వచ్చింది. కనుక మనసును నీవు సరియైన స్థితిలో పెట్టుకో. మనసును సరియైన స్థితిలో పెట్టుకొన్నప్పుడే నీవు సరైన మనిషిగా రూపొందుతావు. సామాన్యముగా ప్రపంచము లోపల యేదైనా తప్పుపని చేసినప్పుడు ఏమిరా పశువా అని తిడతాము. అనగా యేమిటి! నీవు చేయవలసిన పని కాదే యిది పశువు చేయవలసిన పని యిది అని నిందించటం. ఒరే! నీవు మనిషి అయినప్పటికి పశువుగా ప్రవర్తిస్తున్నావే అని నిందించటం.

కనుక మనస్సనేది చాలా వుత్తమమైనది. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. మోక్షానికి కూడా అర్హత కలిగినది యిది. చెడ్డది ఎట్లా అవుతుంది. బంధనా కలిగిస్తుంది. బంధవిమోచనా చేయిస్తుంది. ఇతే దానిని వుపయోగించుకునే విధానము మనము గుర్తించాలి. చేతిలో కత్తి వుంటుంది. పండు కోసుకోవచ్చు. కూరగాయలు కోసుకోవచ్చు విప్పవలసినదైతే దానిని విప్పి సుఖంగా మనము అనుకూలము గావించుకోవచ్చు. కోపము వచ్చినట్లైతే ఈ కత్తిలో గొంతు కోసుకోవచ్చు కానీ యీ దోషము కత్తిదా. కాదుకాదు. మనము వుపయోగించుకునే విధానములో వున్న దోషము. మనస్సు కూడా అట్టిదే. దానిని సరైన మార్గములో ప్రవేశపెడితే అది పవిత్రమైన స్థానానికి గాని పోతుంది. మనస్సును మాయలమారి అని కూడను పిలుస్తూ

వచ్చారు. దీనినే మాయ అని కూడను చింతిస్తూ వచ్చారు. ఇది ఒక పిల్లి వంటిది. ఈ మార్జాలము యొక్క విషయాన్ని మనము చక్కగా విచారణ చేసినప్పుడు, యీ మనస్సు యొక్క ప్రభావము కూడను దీనికి సరియైన సమన్వయమై పోతుంది. తన పిల్లలను సంరక్షించుకొనే నిమిత్తమై యీ మార్జాలము నోటితో కరచుకొని పోయి సుక్షేమమైన స్థలానికి తీసుకుపోతుంది. అదే నోటిలో ఎలుకను కరచుకున్నప్పుడు ప్రాణం తీస్తుంది. నోరు ఒకటే ఇక్కడ నా బిడ్డలు అనేదాని చేత సుక్షేమమైన స్థానానికి చేరుస్తుంది. ఇది నాకు ఆహారము కదా అని భావించి ఎలుకలను బాగా శిక్షిస్తుంది. మనసు కూడా అట్టిదే. దైవ చింతన చేసే వారలను సత్కార్యములో చరించే వారలను సద్బుద్ధులు కలిగినవారలను సన్మార్గములో వుండిన వారలను యిది సక్రమమైన మార్గములో సుక్షేమమైన మార్గానికి చేరుస్తుంది. దుష్టులను దుర్మార్గులను, అధర్మములో ప్రవర్తించే వారలను చూచినప్పుడు యిది హింసిస్తుంది. కనుక మనస్సు ఒక్కటే అయినప్పటికిని అనేక రకములుగా రూపొందుతుంటాది. దీనినే mono act అంటారు. అనేక రకములైన రూపాలు ధరిస్తుంది. ఏ సంకల్పమునకు తగిన ఆ సంకల్పము యొక్క రూపాన్ని ధరిస్తుంది. ఈనాటి జగత్తునందు మానవునికి, కష్టములకు, నష్టములకు, బాధలకు కారణము వారి వారి సంకల్పములే. సంకల్పముల చేత యింతైనా మనము చేయవచ్చు. అణుమాత్రము అగ్నియే మనము చేజిక్కించుకున్నామంటే శ్రద్ధనే బలపరచుకున్నామంటే దానిని కావలసినంత నిప్పుగా మనము అభివృద్ధి గావించుకోవచ్చు. ఇదే భగవంతుడు సంకల్పించుకున్నాడంటాం. ఏకోహం బహుస్యాం. తనకు తాను సంకల్పించుకొని ఏకత్వము అనేకత్వముగా మారిపోయింది. తిరిగి అనేకత్వములో వున్న ఏకత్వాన్ని మరల చేసుకుంటూ వచ్చాడు.

అనేకత్వములోని ఏకత్వము, ఏకత్వములోని అనేకత్వము రెండింటికిని సంకల్పములే మూలకారణము. కనుకనే మన సంకల్పములను పవిత్రమైన మార్గములో పెంచుకోవాలి. మననుండి ఆవిర్భవించిన తక్షణమే యీ సంకల్పము సరైనదా కాదా అని ఆలోచన చేయాలి. కాని మానవుడు తొందరపాటుతో యీ విషయానికే మాత్రము కూడను అవకాశము యివ్వటం లేదు. తొందరపాటు ఎక్కువ. అన్న కోరిన తక్షణమే లభించాలి. అన్నీ లభించాలి. కనుకనే Haste makes waste; waste makes worry. so do not be in hurry. ఈరకమైన దీనిలోపల మనము సరైన రీతిలో నిదానముగా బుద్ధి కందించి బుద్ధి యొక్క విచారణ చేత తదుపరి దీనిని మనము నిర్ణయించుకోవాలి. అప్పుడే మనకు శాంతి లభిస్తుంది.

If there is righteousness in the heart there is beauty in the character
If there is beauty in the character, there will be harmony in the home
If there is harmony in the home, there is order in the nation.
If there is order in the nation there will be peace in the world.

కనుకనే our peace మనకు రావాలంటే సరైన నడతను మనము అలవర్చుకోవాలి. Right action. అదే ధర్మము అన్నారు. ఈ right action మనకు కావాలనుకున్నప్పుడు Right thoughts సరియైన తలంపులు మనకు చిక్కాలి. మొట్టమొదట యింటి లోపల శాంతిని మనము పెంచుకోవాలి. ఇంటిలో శాంతిని పెంచుకునే పూర్వము వొంటిలో శాంతిని మనము పెంచుకోవాలి. నీ ఒంటిలో శాంతి లేకపోతే యింటిలో శాంతి నెలా అందిస్తావు. ఇంటిలోన శాంతి లేనప్పుడు ఊరిలో యేవిధముగా శాంతి నందిస్తావు. అందరూ చెప్తుంటారు భజన అయినతరువాతగాని లోకక్షేమము అయినతరువాతగాని శాంతి శాంతి శాంతిః అని. నోటితో వచ్చినంత మాత్రమున మనకు శాంతి లభ్యమవుతుందా. ఈ శాంతి యొక్క రహస్యాన్ని కూడను మనము గుర్తించాలి. ఆధి భౌతిక శాంతి, ఆధ్యాత్మిక శాంతి, ఆధిదైవిక శాంతి. ఆధిభౌతికమంటే మొట్టమొదట దేహములో శాంతిని పొందాలి. దైవిక మనగా దైవము యొక్క అనుగ్రహముతో లభించేటువంటిదే. నా యొక్క ప్రయత్నము మియు లేదు. భగవంతునికి surrender కావటమే. అతనికి అర్పితము కావటమే యిది ఆధిదైవికము. ఇట్లు భగవంతునికి శరణాగతి యైతే భగవంతుడు అన్నీ అర్పితము గావించుకుంటాడా? నీవు చేయవలసిన కర్తవ్యాన్ని నీవు చేయాలి. కనుకనే కర్తవ్యం యోగముచ్యతే. కర్తవ్యమును నిర్వర్తించాలి. కర్తవ్యాన్ని నిర్వర్తించక, కేవలము భగవంతుడే చూచుకుంటాడంటే యిది కేవలము సోమరిపోతుతనము. తట్టలో వున్న పదార్థము పొట్టలో చేరవలెనంటే నోటికి చేతికి పనిపెట్టనక్కర లేదా. కేవలము తట్టలో వున్న పదార్థము పొట్టలో చేరాలి అని ఎన్నిసార్లు వుచ్ఛరిస్తే మాత్రం పొట్ట నిండుతుందా. నీకు ఆ శక్తి వున్నది. ఈ శక్తి లేనప్పుడు భగవంతునికి శరణాగతుడవైనా ఫరవాలేదు. శక్తి వుండినా లేకపోయినా సర్వము భగవత్ ప్రీత్యర్థమనే భావముతో నీవు ఆచరించు.

విద్యార్థులారా! సంకల్పములు మనలో సరియైనవిగా ఆవిర్భవించాలనుకుంటే కేవలము ఆధ్యాత్మిక మార్గములో మనము ప్రవేశించాలి. అదిలేకుండా మనకు యేరకంగా కూడ సత్సంకల్పములు ఆవిర్భావము కావు. సత్సంగములో చేరాలి. ఈ యొక్క మంచి

524059010

సంఘములో మనము చేరినప్పుడే సత్సంకల్పాలు వస్తాయి. ఈ సంకల్పాలకు అంటువ్యాధి అనేది ఒకటి వుంది. ఈ వ్యాధి సంకల్పములలో ఆవరించి వుంటుంది. దుష్టభావముల కలిగిన వారి సహవాసమే మనము పట్టినామంటే మనకు కూడా ఆ దుష్టభావములు వస్తాయి క్రోధములో నున్నవానితో మనము సహవాసము చేశామంటే ఆ క్రోధము మనలో కూడ ఆవిర్భవిస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. నన్ను ఎవరినన్నా కొప్పడతావు. ఎదుపరి అతనికి కూడా నాపైన కోపమవుతుంది. కొడతాడు. ఐతే అతని కోపానికి కారణం ఏమిటి? నా కోపమే అతనికి కోపం తెప్పించింది. కాబట్టి ఇదే అంటువ్యాధి. కనుకనే మనము దుస్సంగములో ఏమాత్రము చేరరాదు. ఇదే Einstein కూడా చెప్పింది. Tell me your company I shall tell you what you are. మనమెవరో మనము చెప్పుకోవాలనుకుంటే మన సంఘాన్ని మనము చక్కగా విచారణ చేయాలి. కనుక మనము సత్సంఘముతో చేరాలి. దీనినే

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః.

సత్సంగము వలననే మనకు సత్సంకల్పాలు ఆవిర్భవిస్తాయి.

విద్యార్థులారా! మీరు పవిత్రమైన సంకల్పములను అభివృద్ధి పరచుకుంటూ పవిత్రమైన భావములతో మీ జీవితాలను సార్థకము గావించుకోండి. ఆదర్శమైన జీవితాన్ని మీరు ఇతరులకు అందించండి. అంతేగాని తాత్కాలికమైన సుఖసంతోషముల నిమిత్తమై దుస్సంకల్పములను, దుర్భావములను, దుశ్చేష్టలను మనము అభివృద్ధి పరచుకోరాదు. ఇవి అప్పటికప్పుడు నకు సుఖసంతోషములను ఫలితములను అందిస్తున్నవిగాని అంతకు మించి పదిరెట్లు నూరురెట్లు ప్రమాదము మనకు సంభవిస్తుంది. కనుక మీరు ముందు విచారణ చేయండి. ప్రతిదానికి Reaction, rebound, reflection వున్నదనే సత్యాన్ని మీరు విశ్వసించండి. నీవు చేసిన పనులన్నింటికి తత్ఫలితము నందిస్తుంది. 'ఏ విత్తులను నాటి యిచ్చేటు నుంటిరో ఆ ఫలముతే మీకు అందుచుండు'.

జనని గర్భమునుండి జన్మించినప్పుడు
కంఠమాల లేవి కానరావు
మంచి ముత్యపు సరుల్ మాల్చునకు లేవు
మేల్మి బంగరు దండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చల కెంపులు పొదగలేదు.

వజ్రాల హారముల్ వర్థిల్లగా లేవు
గోమేధికంబుల తోడ లేవు
కలదు కలదొక్క మాల మా కంఠమందు
ఎన్ని చేసిన అవి యన్ని యెంచి యెంచి
మంచియైనను చెడుగైనను త్రుంచకుండ
బ్రహ్మ మాకిచ్చి పంపును బరువు మాల
కర్మలన్నియు చేసిన కంఠమాల.

అదే మనమాల. కనుక మనము మంచిని చేసి మంచిమాలను మనము ధరిద్దాము. చెడ్డ పనులు చేసి చెడ్డమాలను మనము ధరించనక్కరలేదు.

విద్యార్థులారా! పవిత్ర హృదయములు పవిత్రకాలము. మనము అనుభవించిన ప్రతిదానికి కృతజ్ఞత. కృతజ్ఞత యిప్పుడే ఒక విద్యార్థి చెప్పాడు gratitude అని. అది లేకపోవుట చేతనే అడవిలో నున్న క్రూర మృగముల కంటెను హీనుడై పోతున్నాడు. క్రిందపడిపోయిన towel ను అందిస్తే thanks అంటారు. కానీ యిన్ని చేసినందుకు భగవంతునికి థాంక్స్ చెప్పనక్కరలేదా. ఇంత విశాల జగత్తును అందించాడు. పవిత్రమైన వాతావరణము కల్గించాడు. త్రాగుటకు జలమును యిచ్చాడు. పీల్చుకొనుటకు గాలి యిచ్చాడు. వుండుటకు స్థానమిచ్చాడు. పంచభూతములను నీకు ప్రసాదించినప్పుడు యీ పంచభూతముల యొక్క ప్రభావాన్ని మీరు అనుభవిస్తూ యీ పంచభూతములను అందించిన వానికి మీరు కృతజ్ఞత చెప్పకపోవుటము యిదే గొప్ప పాపము. మన డబ్బుతో మనము కొన్నాము పొలం. మన డబ్బుతో మనము కట్టాము యిల్లు. కానీ corporation వారు tax కట్టమంటారు యింటికి. అందించేది ఏమిటి? కరెంటునందిస్తున్నారు. నీరు అందిస్తున్నారు వూరికే అందిస్తున్నారా? దీనికి కూడను tax కట్టమంటారు. కొళాయి water యిచ్చినందుకే tax కడుతున్నాము. రెండు బల్బులు వెల్గించుకున్నందుకు tax కడుతున్నాము. ఇంత విశ్వాన్ని ప్రకాశింపచేసే సూర్యుని అందించినందుకు మనము యేమి tax యిస్తున్నాము. మలయమారుతము నందిచ్చిన యీ పరమాత్మునకు యేమి tax కడుతున్నాము. కుంభవర్షమును కురిపించి యీ ప్రపంచమునంతా చల్లబరచిన యీ నీటికి, భగవంతునికి మనము ఏ tax కడుతున్నాము. ఇంత మాత్రము మానవుడు విచారించనక్కరలేదా. ఇది మన మనస్సులో వున్న తమోగుణ ప్రభావము. మనసునకు మూడు గుణములుంటున్నాయి. సత్వరజో తమో

524059012

గుణములు. వీటి యొక్క ప్రభావము గురించి రేపు మనము ముచ్చటించుకుందాము. ముందుకు కార్యక్రమాలన్నీ వుంటున్నాయి. చక్కని గానము. మధురమైన రామనామము.

చక్కెర కంటె తీపి దధిసారము కంటెను రుచ్యమౌను తెం
పెక్కిన తెనెకన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించు కాన నిత్యమున్
చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్.

ఇప్పుడు రామనామము కథను గానము చేస్తారు. ఆనందముగా శ్రవణము చేయండి.